
ఈ-పేపర్ తెలుగు డైలీ

ఇయ్యాల్టి NEWS
Local 2 GlobaL


https://epaper.eyyaltynews.com/

## మండే ఎండల్లో హైదరాబాద్‌కు కూల్ న్యూస్..ఇదిగో వెదర్ రిపోర్ట్



ఇయ్యాల్టి న్యూస్, హైదరాబాద్, మే 29: జూన్ 1వ తేదీ శనివారం నాడు నగరంలోని మొత్తం ఆరు జోన్లలో వర్షాలు కురిసే అవకాశం ఉందని హైదరాబాద్ వాతావరణ విభాగం తెలిపింది. తేలికపాటి నుండి మోస్తరు వర్షాలు లేదా ఉరుములతో కూడిన జల్లులు పడే అవకాశం ఉంది. ఆకాశం మేఘావృతమై ఉంటుందని కూడా ఐఎండీ తెలిపింది. శుక్రవారం నగరంలో ఉష్ణోగ్రత 36 డిగ్రీల సెల్సియస్‌కు తగ్గే అవకాశం ఉందని ఆ శాఖ అంచనా వేసింది. అయితే గురువారం ఉష్ణోగ్రత 41 నుంచి 44 డిగ్రీల సెల్సియస్‌లో ఉండవచ్చని వెల్లడించింది. హైదరాబాద్‌లో శనివారం వర్షం కురిసే అవకాశం ఉన్నప్పటికీ, తెలంగాణలోని ఇతర జిల్లాల్లో రానున్న కొద్దిరోజుల పాటు వర్షాలు కురిసే పడే సూచనలు లేవని వాతావరణ శాఖ అధికారులు తెలిపారు.





ఫోన్ ట్యాపింగ్ కోసం 17 కంప్యూటర్లు... కాంగ్రెస్ అధికారంలోకి వచ్చాక అన్నీ ధ్వంసం చేశాం: ప్రణీత్ రావు. 2లో



హైదరాబాద్ శివారులో అమ్మో పులి..! ఉలిక్కిపడ్డ జనం.. చివరికి నిజం తెలిసి షాక్..! 2లో



బీజేపీ విధానాలతో చిన్న పరిశ్రమలు చిన్నాభిన్నం : ప్రియాంక గాంధీ.. 3లో



కాంగ్రెస్ హయాంలో భారీ కుంభకోణాలతో కుంటుపడిన అభివృద్ధి : ప్రధాని మోదీ.. 3లో

# స్టేట్ గీతం, లోగోపై సీఎం రేవంత్ రివ్యూ...

## అఫీషియల్ లోగో ఫైనల్‌గా ఇదేనంటూ ఫోటోలు వైరల్

ఇయ్యాల్టి న్యూస్, హైదరాబాద్, మే 29: తెలంగాణ రాష్ట్ర గీతం రూపకల్పన తుది దశకు చేరుకుంది. జయ జయహే తెలంగాణ గీతం రూపకల్పనపై సీఎం రేవంత్? రెడ్డి సమీక్ష నిర్వహించారు. ఈ సమీక్ష సమావేశంలో ఉపముఖ్యమంత్రి భట్టి విక్రమార్క, కవి అందెశ్రీ, సంగీత దర్శకుడు కీరవాణి, ప్రొఫెసర్? కోదండరాం, అద్దంకి దయాకర్?, పలువురు పాల్గొన్నారు. ఈ సమీక్షలో రాష్ట్ర గీతం జయ జయహే తెలంగాణ గీతాన్ని సంగీత దర్శకుడు కీరవాణి బృందం పాడి వినిపించింది.





గీతం నిడివి, స్వరకల్పన, గాయకులని ఖరారుచేశారు. మార్పులు, చేర్పులని కవి అందెశ్రీ, సంగీత దర్శకుడు కీరవాణి వివరించారు. తెలంగాణ ఉద్యమ స మయంలో ఉర్రూతలూ గించిన అందెశ్రీ గీతం 'జయ జయహే తెలంగాణ'ని ఇప్పటికే ప్రభుత్వం రాష్ట్ర గీతంగా ప్రకటించగా, ప్రముఖ సంగీత దర్శకుడు ఎంఎం కీరవాణి స్వరకల్పన చేశారు.

**తెలంగాణ కొత్త అధికారిక చిహ్నం**

తెలంగాణలో రేవంత్ రెడ్డి ప్రభుత్వం కొత్త అధికారిక చిహ్నాన్ని ఖరారు చేయనుంది. కొత్త చిహ్నం రూపొందించడంలో రూపకర్త రుద్ర రాజేశం అండ్ కో బిజీగా ఉంది. వారు సిద్ధం చేసిన కొన్ని లోగోలను సీఎం రేవంత్ రెడ్డి పరిశీలించారు. అందులో ఒకదానిని సెలక్ట్ చేసి కొన్ని మార్పు చేర్పులు సూచించినట్లుగా తెల్సుతోంది. తెలంగాణ సంస్కృతి, సంప్రదాయం వెల్లివిరిసేలా 40కి డిజైన్లు రూపొందించారు.

**డిజైన్లను ఫైనల్ చేసే పనిలో రేవంత్ రెడ్డి**

గతంలో బీఆర్ఎస్ ప్రభుత్వం ఖరారు చేసిన లోగో రాచరిక పోకడలతో ఉందని.. అమరుల త్యాగాలు ఎత్తిపట్టేలా తెలంగాణ చిహ్నం ఉండాలని రేవంత్ నిర్ణయించారు. తెలంగాణ కోసం బిడ్డలు ప్రాణ త్యాగం చేశారని. వారి త్యాగాలు ఉట్టిపడేలా చిహ్నం ఉండాలని సీఎం రేవంత్ రెడ్డి రుద్ర రాజేశంకు సూచించారు. తెలంగాణ సంస్కృతి, సంప్రదాయాలు ఉట్టి పడేలా లోగోను ఖరారు చేయనున్నారు. తెలంగాణ చిహ్నం చూశాక ప్రజలు తప్పకుండా సంతోషిస్తారని ప్రభుత్వ వర్గాలు చెబుతున్నాయి.

**రాచరికపు పోకడలు లేకుండా కొత్త చిహ్నం**

రేవంత్ రెడ్డి మొదటి నుంచి తెలంగాణ చిహ్నం మారుస్తామని చెబుతున్నారు. తెలంగాణ అంటేనే త్యాగాలు, పోరాటాలని.. ఇక్కడ రాచరిక ఆనవాళ్లకు చోటు లేదని చెప్పారు. అధికారిక చిహ్నంలో కాకతీయ తోరణం కూడా ఉండబోదని ఆయన స్పష్టం చేశారు. నిజామాబాద్?కు చెందిన ఫైన్ ఆర్ట్స్ కాలేజ్ ప్రిన్సిపల్?కు రాజముద్ర రూపకల్పన బాధ్యతల్ని అప్పగించామని రేవంత్ పేర్కొన్నారు. సమ్మక్క-సారక్క, నాగోబా జాతర స్ఫూర్తి ప్రతిబింబించేలా తెలంగాణ చిహ్నాన్ని తయారు చేస్తున్నామని రేవంత్ ఇప్పటికే ప్రకటించారు.

# నిరుద్యోగులకు గుడ్ న్యూస్

- ముప్పైకి పైగా కంపెనీలు..5 వేల ప్లస్ ఉద్యోగాలు..
- టీచర్ రిక్రూట్మెంట్ ఇక్కడ స్పెషల్...రేపే మెగా జాబ్ మేళా...




ఇయ్యాల్టి న్యూస్, అంబర్ పేట, మే 29: నిరుద్యోగులకు గుడ్‌న్యూస్....ముప్పైకి పైగా కంపెనీలు పాల్గొననుండగా .5 వేలకు పైగా ఉద్యోగాల భర్తీతో పాటు టీచర్ వృత్తిలో రాణించే వారికి ఇక్కడ రిక్రూట్మెంట్ కల్పించడం ప్రత్యేకం ..కాగా ఈ మెగా జాబ్ మేళా రేపు నిర్వహిస్తున్నారు.. వివరాల్లోకి వెళ్తే.... ప్రముఖ స్వచ్ఛంద సంస్థలు పరావస్తు క్రియేటివ్ ఫౌండేషన్ , లయన్స్ క్లబ్ ఆఫ్ హైదరాబాద్ (గ్రీన్ ల్యాండ్స్), రాంకీ ఫౌండేషన్ ల సంయుక్త ఆధ్వర్యంలో మేగా జాబ్ మెళా నిర్వహిస్తున్నట్లు నిర్వాహకులు హరి సందీప్, మువ్వరామిరెడ్డి, లక్ష్మి కుమారి తదితరులు తెలిపారు. రేపు 31వ తేదీ శుక్రవారం ఉదయం 10 నుంచి సాయంత్రం 5 గంటల వరకు సికింద్రాబాద్ రాణిగంజ్ గుజరాతి హైస్కూల్లో ఏర్పాటు చేస్తోన్న ఈ మెగా జాబ్ మేళాలో 30 కి పైగా పలు ప్రముఖ సాఫ్ట్ వేర్ సంస్థలు పాల్గొంటున్నాయని తెలిపారు. ఉపాధ్యాయ వృత్తిలో రాణించే వారికి తొలి సారిగా ప్రత్యేకంగా జాబ్ మేళా ఏర్పాటు చేస్తున్నామని అన్నారు. పదవ తరగతి నుంచి బీటెక్, ఎంబీఏ వరకు చదివిన వారు అర్హులని తెలిపారు. టీచర్ ఉద్యోగాల కోసం డీఈడీ, బీఈడీ, ఎంఈడీ చదివిన వారు అర్హులని వారు వివరించారు. నిరుద్యోగ యువత ఈ చక్కటి అవకాశాన్ని వినియోగించుకోవాలన్నారు. పూర్తి వివరాలకు పరావస్తు క్రియేటివ్ ఫౌండేషన్ వెబ్ సైట్లో గానీ, 95424 33427 ఫోన్ నెంబర్లలో సంప్రదించాలని వారు కోరారు.

## ధాన్యం అమ్ముకుందామంటే కొనేటోడు లేడు..!

### విత్తనాలు కొందామంటే అమ్మేటోడు లేడు..!! : కేటీఆర్



ఇయ్యాల్టి న్యూస్, హైదరాబాద్, మే 29: కాంగ్రెస్ పాలనలో రైతులకు కన్నీటి కష్టాలు మొదలయ్యాయి. గత ఐదారు నెలల నుంచి రైతుల అనేక సమస్యలు ఎదుర్కొంటున్నారు. సాగునీరు లేక పంటలు ఎండిపోయాయి. పోని పండిన పంటలను కూడా కొనేందుకు ప్రభుత్వం ముందుకురాలేదు. దాంతో అకాల వర్షాలకు పంట తడిసిపోయింది. చివరకు మిగిలిన ధాన్యాన్ని కూడా మద్దతు ధరకు కొనే దిక్కు లేదు. ఇక ఖరీఫ్ సీజన్‌లో వేసే పంటలకు సంబంధించిన విత్తనాల కోసం రైతులు సీడ్ షాప్సు ముందు బారులు తీరుతున్నారు. విత్తనాల కోసం రైతులు అనేక ఇబ్బందులు పడుతున్నారంటూ బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ రైతుల బాధలపై ట్వీట్ చేశారు. రాష్ట్రంలో ప్రభుత్వం ఉన్నట్టా..? లేనట్టా..? అని ప్రశ్నించారు. విత్తనాల కోసం రైతులకు ఏమిటీ వెతలు..? అని నిలదీశారు. వ్యవసాయ పరిస్థితులను పర్యవేక్షించాలని వ్యవసాయ మంత్రి ఎక్కడ..? ముందుచూపు లేని ముఖ్యమంత్రి జాడేది..? అని నిలదీశారు కేటీఆర్. నిన్న.. ధాన్యం అమ్ముకుందామంటే కొనేటోడు లేడు..! నేడు.. విత్తనాలు కొందామంటే అమ్మేటోడు లేడు..!! పాలన పూర్తిగా పడకేసిందని చెప్పడానికి.. ఇంతకన్నా నిదర్శనం ఇంకేం కావాలని కేటీఆర్ పేర్కొన్నారు.తెల్లవారుజామున 4 గంటలకు లైన్‌లో నిలబడితే.. సాయంత్రం 4 గంటల వరకూ విత్తనాలు ఇవ్వలేరా..? గత పదేళ్లపాటు.. 10 నిమిషాల్లో అందిన విత్తనాలు.. ఇప్పుడు 10 గంటల పాటు పడిగాపులు పడినా అందించలేరా ?? అని నిలదీశారు కేటీఆర్. దేశం కడుపునింపే స్థాయికి ఎదిగిన తెలంగాణ.. అన్నదాతకే తిండితిప్పలు లేకుండా చేస్తారా ?? కాంగ్రెస్ వచ్చింది.. కాటగలిసినం అంటున్న.. అన్నదాతలను ఇంకా అరిగోస పెట్టకండి..!! లేకపోతే.. రైతుల సంఘటిత శక్తిలో ఉన్న బలాన్ని.. కాంగ్రెస్ ప్రభుత్వం చవిచూడక తప్పదు..!! అని కేటీఆర్ హెచ్చరించారు.

### రాష్ట్ర చిహ్నం నుంచి కాకతీయ కళాతోరణం తీసివేయడంపై

## బీఆర్ఎస్ నేతలు నిరసన


**ఇయ్యాల్టి న్యూస్, వరంగల్, మే 29:** తెలంగాణ రాష్ట్ర చిహ్నం నుంచి కాకతీయ కళాతోరణాలు తీసివేయడానికి నిరసిస్తూ ఖిలా వరంగల్?లోని కాకతీయ కళాతోరణం ఎదుట బీఆర్ఎస్ నేతలు నిరసనకు దిగారు. కాకతీయ రాజుల పాలన దీక్షకు ప్రతీక అయిన కాకతీయ కళా తోరణాన్ని దురుద్దేశంతోనే రేవంత్ రెడ్డి ప్రభుత్వం తొలగిస్తున్నట్టు నిరసన వ్యక్తం చేశారు. వరంగల్ ఈస్ట్ మాజీ ఎమ్మెల్యే నన్నపనేని నరేందర్ ఆధ్వర్యంలో జరిగిననిరసన కార్యక్రమంలో మాజీ ఎంపీ వినోద్ కుమార్, మాజీ ఎమ్మెల్యేలు పెద్ది సుదర్శన్ రెడ్డి, వినయ్ భాస్కర్, ఎమ్మెల్సీ బస్వరాజు సారయ్య, బీఆర్ఎస్ నేతలు పాల్గొన్నారు.





## జూలై నెలాఖరులోగా అక్కడ కొత్త రూల్..


### ప్రముఖ పర్యాటక ప్రాంతంపై సీఎస్ కీలక ఆదేశాలు



ఇయ్యాల్టి న్యూస్, హైదరాబాద్, మే 29: అమ్రబాద్ టైగర్ రిజర్వ్ ప్రాంతాన్ని సందర్శించే పర్యాటకులకు కీలక అప్ డేట్. ఇక్కడ ప్లాస్టిక్ నిర్మూలించేందుకు రాష్ట్ర ప్రభుత్వం కీలక నిర్ణయం తీసుకుంది. జూలై నెలాఖరులోగా 'అమ్రాబాద్ టైగర్ రిజర్వ్' ను పూర్తిగా ప్లాస్టిక్ రహిత జోన్‌గా మార్చేందుకు కార్యాచరణ ప్రణాళిక రూపొందించాలని ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి శ్రీమతి శాంతి కుమారి అధికారులను ఆదేశించారు. బుధవారం రాష్ట్ర సచివాలయంలో అటవీ, పంచాయతీరాజ్, కాలుష్య నియంత్రణ మండలి అధికారులతో శాంతి కుమారి సమావేశం అయ్యారు. ఈ సందర్భంగా అమ్రాబాద్ టైగర్ రిజర్వ్ ప్రాంతంలో ప్లాస్టిక్ వస్తువుల వినియోగానికి అడ్డుకట్ట వేసే విషయంలో అధికారులతో చర్చలు జరిపి పలు కీలక ఆదేశాలు జారీ చేశారు. కాగితపు సంచులులు, గుడ్డి, జనపనార సంచులు, విస్తరాకులు వంటి ప్లాస్టిక్ ప్రత్యామ్నాయాలను ప్రోత్సహించాలని, వీటిపై ప్రజలకు, ఆ ప్రాంతంలోని వ్యాపారులకు అవహగాన కల్పించాలని సూచించారు. ప్లాస్టిక్ నివారించే ప్రయత్నాల్లో భాగంగా అమ్రాబాద్ అటవీ ప్రాంతంలో అదనపు చెక్ పోస్టులను ఏర్పాటు చేయాలని ఆమె సూచించారు.

## మద్యం కేసులో కవిత పాత్రపై ఈడీ ఛార్జిషీట్

### పరిగణనలోకి తీసుకున్న కోర్టు



ఇయ్యాల్టి న్యూస్, ఢిల్లీ , మే 29: ఢిల్లీ మద్యం కేసులో కవితతో పాటు మరో నలుగురిపై ఈడీ మే 10న దాఖలు చేసిన అనుబంధ చార్జిషీట్‌ను రౌస్ అవెన్యూ సీబీఐ ప్రత్యేక కోర్టు పరిగణనలోకి తీసుకుంది. మద్యం కేసులో కవితతో పాటు నలుగురి పాత్రపై ఈ ఛార్జిషీట్‌లో పేర్కొన్నారు. జూన్ 3న ఈ ఛార్జిషీట్‌పై కోర్టు విచారణ జరపనుంది. ఆ రోజున ఈ ఛార్జిషీట్ నిందితులు అందరూ కోర్టుకు హాజరు కావాలని సమన్లు జారీ చేసింది. దీంతో కవితను జూన్ 3న ఈడీ అధికారులు కోర్టు ఎదుట హాజరుపరచనున్నారు. గోవా ఎన్నికల సమయంలో ఆమ్ ఆద్మీ పార్టీ తరపున ప్రచారం చేసిన దామోదర శర్మ, ప్రిన్స్ కుమార్, చన్ ప్రీత్ సింగ్, అరవింద్ సింగ్‌లను చార్జిషీట్‌లో ప్రస్తావించారు. ఈ అనుబంధ ఛార్జిషీట్‌లో అన్ని వివరాలు వెల్లడించారు. మద్యం పాలసీ కేసులో డబ్బు గోవాకు ఎలా చేరిందో ఇందులో ఈడీ పేర్కొంది.

### స్పా సెంటర్ పై దాడి..

## 8 మంది యువతులు అరెస్ట్



ఇయ్యాల్టి న్యూస్, హైదరాబాద్, మే 29: అక్రమంగా నిర్వహిస్తున్న స్పా సెంటర్లపై పోలీసులు దాడులు నిర్వహించారు. హైదరాబాద్ గుడిమల్కాపూర్ పోలీస్ స్టేషన్ పరిధిలోని నాలా నగర్ లోని ఓ అపార్ట్ మెంట్ లో అక్రమంగా నిర్వహిస్తున్న జన్నత్, మ్యాజికల్ ఫ్రెండ్స్ అనే రెండు స్పా సెంటర్లపై బుధవారం పోలీసులు దాడి చేశారు. ఈ దాడిలో ఎనిమిది మంది మహిళలతో పాటు నిర్వాహకులు రూబీ, మహమ్మద్ ఆరిఫ్, ఆదిత్యను అదుపులోకి తీసుకున్నారు. స్పా సెంటర్ లో మసాజ్ పేరుతో అసాంఘీక కార్యకలాపాలకు పాల్పడుతున్నారనే పక్కా సమాచారంతో పోలీసులు ఈ రెయిడ్స్ చేసినట్లు తెలుస్తోంది.

### తెలంగాణ ఆవిర్భావ దినోత్సవం వేళ..

## 10 వేల మందితో బీఆర్ఎస్ భారీ ప్లాన్




ఇయ్యాల్టి న్యూస్, హైదరాబాద్, మే 29: సీఎం రేవంత్ రెడ్డి నేతృత్వంలోని కాంగ్రెస్ ప్రభుత్వంపై బీఆర్ఎస్ మాజీ ఎమ్మెల్సీ కర్నె ప్రభాకర్ హాట్ కామెంట్స్ చేశారు. తెలంగాణ భవన్‌లో బుధవారం ఆయన మీడియాతో మాట్లాడుతూ..ఈ జూన్ 2తో తెలంగాణ రాష్ట్రం వచ్చి పది సంవత్సరాలు అవుతోందని గుర్తు చేశారు. బీఆర్ఎస్ ఆధ్వర్యంలో తెలంగాణ దశాబ్ది ముగింపు ఉత్సవాలు ఘనంగా నిర్వహిస్తామని తెలిపారు. జూన్ 1వ తేదీన గన్ పార్క్ అమరవీరుల స్థూపం వద్దకు కేసీఆర్ చేరుకుని నివాళులు అర్పిస్తారని చెప్పారు. గన్ పార్క్ అమరవీరుల స్థూపం నుండి సెక్రటేరియట్ ఎదురుగా ఉన్న అమరవీరుల స్థూపం వరకు పదివేల మందితో భారీ ర్యాలీ నిర్వహిస్తామని తెలిపారు. జూన్ 2న జాతీయ జెండా, పార్టీ జెండాను తెలంగాణ భవన్‌లో ఎగురవేస్తామని, అనంతరం భవన్‌లో సమావేశం, ఫోటో ఎగ్జిబిషన్ ఉంటుందని వెల్లడించారు. జూన్ 3న జిల్లా కార్యాలయాల్లో జాతీయ జెండాలు, పార్టీ జెండాలను జిల్లా అధ్యక్షులు ఎగురవేస్తారని చెప్పారు. ఆసుపత్రులు, అనాథ శరణాలయాల్లో స్వీట్లు, పండ్లు పంపిణీ కార్యక్రమం ఉంటుందన్నారు.

ఈ-పేపర్ తెలుగు డైలీ
ఇయ్యాల్టి NEWS
Local 2 GlobaL
https://epaper.eyyaltynews.com/
గురువారం 30, మే 2024


# జూన్ 3న టీఎస్ లాసెట్ ప్రవేశ పరీక్ష.. మూడు సెషన్లలో నిర్వహణ

**ఇయ్యాల్టి న్యూస్, హైదరాబాద్, మే 29:** టీఎస్ లాసెట్, పీజీఎల్‌సెట్ ప్రవేశ పరీక్ష నిర్వహణకు అధికారులు ఏర్పాట్లు పూర్తి చేశారు. జూన్ 3వ తేదీన మూడు సెషన్లలో కంప్యూటర్ బేస్డ్ విధానంలో నిర్వహించనున్నారు. తొలి రెండు సెషన్లకు 68 పరీక్షా కేంద్రాలు, మూడో సెషన్‌కు 50 కేంద్రాలను ఏర్పాటు చేశారు. మూడేండ్ల లా కోర్సుకు 36,079 మంది, ఐదేండ్ల లా కోర్సుకు 10,197 మంది, ఎల్ఎల్ఎం కోర్సుకు 4,408 మంది దరఖాస్తు చేసుకున్నట్లు వెల్లడించారు. జూన్ 3వ తేదీన ఉదయం 9 నుంచి 10.30 వరకు, మధ్యాహ్నం 12.30 నుంచి 2 గంటల వరకు, సాయంత్రం 4 నుంచి 5.30 గంటల వరకు ప్రవేశ పరీక్షలు నిర్వహించనున్నారు. తొలి రెండు సెషన్లలో మూడేండ్ల లా కోర్సు దరఖాస్తుదారులకు, చివరి సెషన్‌లో ఐదేండ్ల లా కోర్సు, పీజీఎల్‌సెట్‌కు దరఖాస్తు చేసుకున్న వారికి పరీక్షలు నిర్వహించనున్నారు.




# ఫోన్ ట్యాపింగ్ కేసులో కేసీఆర్ ఇరుక్కోవడం ఖాయం...: కాంగ్రెస్ నేత జీవన్ రెడ్డి


**ఇయ్యాల్టి న్యూస్, జగిత్యాల, మే 29:** ఫోన్ ట్యాపింగ్ కేసులో విచారణ జరిగితే కేసీఆర్ ఇరుక్కోవడం ఖాయమని... ఇందులో ఆయన పాత్ర కీలకమని కాంగ్రెస్ పార్టీ సీనియర్ నేత జీవన్ రెడ్డి ఆరోపించారు. బుధవారం ఆయన జగిత్యాలలో మీడియాతో మాట్లాడుతూ... ట్యాపింగ్ విషయంపై కేంద్రం స్పందించి సీబీఐ విచారణ జరిపించాలని డిమాండ్ చేశారు. ఈ అంశం కేంద్రం పరిధిలోకి వస్తుందన్నారు. ఉమ్మడి కరీంనగర్ జిల్లా నుంచి మేడిపల్లి సత్యం, జువ్వాడి నర్సింగరావు, కవ్వంపల్లి సత్యనారాయణ ఫోన్లు ట్యాప్ అయ్యాయనే అనుమానాలు ఉన్నాయన్నారు. బీఆర్ఎస్ అని పేరు మార్చడమే కేసీఆర్ పట్ల భస్మాసుర హస్తంగా మారిందని విమర్శించారు. కేసీఆర్ అధికారం కోల్పోవడానికి



ఇది కూడా కారణమైందన్నారు. ప్రధాని మోదీ మత రాజకీయాలు చేస్తున్నారని బీజేపీపై ఆయన విమర్శలు గుప్పించారు. కేంద్రంలో ఇండియా కూటమి అధికారంలోకి రాగానే ఈడబ్ల్యుఎస్ రిజర్వేషన్లు మార్పు చేయడంతో పాటు వెనుకబడిన అన్ని వర్గాలకు... మతాలకు, అతీతంగా రిజర్వేషన్లు అమలు చేస్తామని హామీ ఇచ్చారు. తెలంగాణ రాష్ట్ర గీతం నిర్మాణంలో మ్యూజిక్ డైరెక్టర్‌గా కీరవాణి ఉండటాన్ని బీఆర్ఎస్ తప్పుపట్టడం విడ్డూరంగా ఉందన్నారు. గతంలో ఆంధ్రా సినిమాలకు పన్ను మినహాయింపు ఇచ్చింది బీఆర్ఎస్ ప్రభుత్వం కాదా అని ప్రశ్నించారు.

# గోషామహల్ ఎమ్మెల్యే రాజాసింగ్‌కు చంపుతామంటూ మళ్లీ బెదిరింపు ఫోన్లు

**ఇయ్యాల్టి న్యూస్, హైదరాబాద్, మే 29:** తనకు వివిధ ఫోన్ నెంబర్ల నుంచి బెదిరింపు కాల్స్ వచ్చాయని... తనను చంపుతామంటూ బెదిరిస్తున్నారని గోషామహల్ ఎమ్మెల్యే, బీజేపీ నేత రాజాసింగ్ ఆరోపించారు. ఈ మేరకు ఆయన ఎక్స్ వేదికగా ట్వీట్ చేశారు. తనకు ఇలాంటి బెదిరింపులు రావడం ఇదే మొదటిసారి కాదన్నారు. ఈ బెదిరింపులపై గతంలోనూ తాను ఫిర్యాదు చేశానని... కానీ పోలీసులు చర్యలు తీసుకోలేదని ఆవేదన వ్యక్తం చేశారు. అయినప్పటికీ తనకు వచ్చిన బెదిరింపులపై పోలీసులకు తెలియజేయడం బాధ్యతగా భావిస్తున్నానన్నారు. తనకు వచ్చిన బెదిరింపులకు సంబంధించిన ఫోన్ నెంబర్లను రాజాసింగ్ ట్వీట్‌లో వెల్లడించారు. ప్రధాని మోదీ, పీఎంవో ఇండియా, అమిత్ షా, కేంద్ర హోంమంత్రిత్వ శాఖ, తెలంగాణ డీజీపీ, హైదరాబాద్ సిటీ పోలీస్, తెలంగాణ సీఎంవోలను ఆయన ట్యాగ్ చేశారు.



# టీడీపీ కీలక నేతలతో చంద్రబాబు టెలికాన్ఫరెన్స్...

## కౌంటింగ్ రోజు ప్లాన్‌పై నేతలతో చర్చ

**ఇయ్యాల్టి న్యూస్, ఏపీ, మే 29:** ఏపీలో సార్వత్రిక ఎన్నికల పోలింగ్ తర్వాత విశ్రాంతి కోసం విదేశాలకు వెళ్లిన టీడీపీ అధినేత చంద్రబాబు నాయుడు తిరిగి వచ్చారు. రాష్ట్రంలో ఎన్నికల ఓట్ల లెక్కింపు, ఫలితాలకు ఏర్పాట్లు సాగుతున్న నేపథ్యంలో తిరిగి వచ్చిన చంద్రబాబు.. బుధవారం పార్టీలోని కీలక నేతలతో టెలికాన్ఫరెన్స్ నిర్వహించారు. ఇందులో ప్రధానంగా కౌంటింగ్ డే ప్లాన్‌పై నేతలతో ఆయన చర్చించడం జరిగింది. ముఖ్యంగా పోస్టల్ బ్యాలెట్ ఓట్ల విషయంలో అధికార వైసీపీ మాటల యుద్ధం సాగిస్తున్న నేపథ్యంలో అప్రమత్తంగా ఉండాలని చంద్రబాబు నేతలు, కార్యకర్తలకు సూచించారు. కౌంటింగ్‌పై సీరియస్‌గా దృష్టిపెట్టాలని నేతల్ని చంద్రబాబు కోరారు. ఇందుకోసం శుక్రవారం 175 అసెంబ్లీ, 25 పార్లమెంట్ నియోజక వర్గాల చీఫ్ ఎలక్షన్ ఏజెంట్లతో సమావేశం కావాలని ఆయన నిర్ణయించారు. అలాగే జూన్ 1న జోనల్




స్థాయిలో కౌంటింగ్ ఏజెంట్లకు శిక్షణ ఇవ్వబోతున్నారు. ఈ రెండు కార్యక్రమాలు చాలా కీలకమని చంద్రబాబు భావిస్తున్నారు. అంతేగాక పోస్టల్ బ్యాలెట్ విషయంలో నెలకొన్న భిన్నాభిప్రాయాలు, అంచనాల నేపథ్యంలో కౌంటింగ్‌లో అప్రమత్తంగా ఉండాలని సూచించారు. రాష్ట్రంలో పోస్టల్ బ్యాలెట్ ఓట్ల లెక్కింపు నిబంధనలపై ఇప్పటికే వైసీపీ విమర్శలు చేస్తున్న విషయం తెలిసిందే. ఈ నేపథ్యంలో అప్రమత్తంగా ఉంటూ ఎప్పటికప్పుడు విమర్శల్ని తిప్పికొట్టాలని నేతల్ని చంద్రబాబు ఆదేశించారు.

## ఫోన్ ట్యాపింగ్ కోసం 17 కంప్యూటర్లు...

# కాంగ్రెస్ అధికారంలోకి వచ్చాక అన్నీ ధ్వంసం చేశాం: ప్రణీత్ రావు

**ఇయ్యాల్టి న్యూస్, హైదరాబాద్, మే 29:** ఫోన్ ట్యాపింగ్ కేసులో ఎప్పటికప్పుడు కీలక అంశాలు వెలుగులోకి వస్తున్నాయి. నిందితులు తమ వాంగ్మూలంలో సంచలన విషయాలు వెల్లడిస్తున్నారు. ఎస్ఐబీ మాజీ డీఎస్పీ ప్రణీత్ రావు కూడా ఈ కేసులో ఎన్నో అంశాలను తన వాంగ్మూలంలో వెల్లడించారు. ఫోన్ ట్యాపింగ్ పర్యవేక్షణ కోసం 17 కంప్యూటర్లను వినియోగించామని... కాంగ్రెస్ అధికారంలోకి వచ్చాక రికార్డులను అన్నింటినీ ధ్వంసం చేశామని తెలిపారు. రికార్డులు ధ్వంసం చేసి వాటి స్థానంలో కొత్త వాటిని అమర్చినట్లు చెప్పారు. ధ్వంసం చేసిన ఆధారాలను నాగోల్, మూసరాంబాగ్ వద్ద మూసీలో పడేశామన్నారు. సీడీఆర్, ఐడీపీఆర్ డేటా మొత్తాన్ని కాల్చేసినట్లు చెప్పారు. ఫార్మాట్ చేసిన ఫోన్లు, పెన్ డ్రైవ్‌లను బేగంపేట నాలాలో పడేశామన్నారు. ఫోన్ ట్యాపింగ్ కోసం కన్వర్జెన్స్ ఇన్నోవేషన్ ల్యాబ్ సాఫ్టువేర్‌ను వినియోగించినట్లు చెప్పారు. 56 మంది ఎస్‌వోటీ సిబ్బందిని ఏర్పాటు చేశామన్నారు. ప్రభాకర్ రావు ఆదేశాల మేరకు




ట్యాపింగ్ చేశామని... కాంగ్రెస్ అధికారంలోకి వచ్చాక ట్యాపింగ్ ఆపేయాలని ఆదేశాలు ఇచ్చారని తెలిపారు. ఆయన రాజీనామా చేసే ముందు రికార్డులన్నింటినీ ధ్వంసం చేయాలని కూడా ఆదేశించినట్లు చెప్పారు. దాదాపు 1200 మంది ఫోన్లను ట్యాప్ చేసినట్లు ప్రణీత్ రావు వెల్లడించారు. ప్రధాన ప్రతిపక్ష నేతలపై నిఘా పెట్టామని, వారికి వెళ్లే డబ్బును అడ్డగించి పట్టుకునే వారమన్నారు. నేతలు, జడ్జిలు, రియల్ ఎస్టేట్ వ్యాపారుల ఫోన్లను ట్యాప్ చేసినట్లు అంగీకరించారు. పదిహేడు హార్డ్ డిస్క్‌లలో అత్యంత కీలక సమాచారం ఉందన్నారు.

# మరి కొన్ని గంటల్లో కేరళకు రుతుపవనాల రాక

## పలు రాష్ట్రాల్లో భారీ వర్షాలు

**ఇయ్యాల్టి న్యూస్, ఐఎండీ, మే 29:** దేశంలోని పలు రాష్ట్రాల్లో జనాలు ఎండ తీవ్రతతో సతమతమవుతున్నారు. ఈ నేపథ్యంలో వాతావరణ శాఖ (ఐఎండీ) శుభవార్త చెప్పింది. నేడు ఎప్పుడైనా రుతుపవనాలు భారత సరిహద్దులోకి ప్రవేశించవచ్చని పేర్కొంది. అంటే రాబోవు 24 గంటల్లో రుతుపవనాలు కేరళకు చేరుకోవచ్చు. ఐఎండీ ప్రకారం.. రాబోయే 24 గంటల్లో కేరళలో రుతుపవనాల రాకకు పరిస్థితులు అనుకూలంగా ఉన్నాయి. ఈసారి రుతుపవనాలు కేరళలో సమయం కంటే ముందే వస్తున్నాయి. అయితే ఇప్పటికే భారీ వర్షాలు, నీటి ఎద్దడితో కేరళ అల్లాడిపోతోంది. కేరళలో రుతుపవనాలకు ముందు కురిసిన వర్షాలు త్వరలో రుతుపవనంగా మారనున్నాయని ఐఎండీ పేర్కొంది. ఈరోజు కొట్టాయం, ఎర్నాకులం జిల్లాల్లో రెడ్ అలర్ట్, మరో మూడు జిల్లాల్లో ఆరెంజ్ అలర్ట్ ప్రకటించింది. అంతే కాకుండా కేరళతో పాటు పలు రాష్ట్రాల్లో భారీ వర్షాలు కురిసే అవకాశం ఉందని తెలిపింది. కర్ణాటక,



ఆంధ్రప్రదేశ్, అస్సాంలోని కొన్ని ప్రాంతాలుకు జూన్ 5 నాటికి చేరుతాయి. మహారాష్ట్ర, తెలంగాణ, ఆంధ్రప్రదేశ్ ఎగువ భాగం, పశ్చిమ బెంగాల్ కు జూన్ 10న చేరుకుంటాయని ఐఎండీ తెలిపింది. నైరుతి రుతుపవనాలు సాధారణంగా జూన్ 1 నాటికి కేరళలోకి ప్రవేశిస్తాయని తెలిసిందే. సాధారణంగా ఇది ఉప్పెనతో ఉత్తరం వైపు కదులుతుంది. జూలై 15 నాటికి దేశం మొత్తాన్ని కవర్ చేస్తుంది. దీనికి ముందు.. మే 22న రుతుపవనాలు అండమాన్, నికోబార్‌ను దీవులను తాకాయి. ఈసారి రుతుపవనాలు సాధారణం కంటే 3 రోజులు ముందుగా మే 19న అండమాన్‌కు వచ్చాయి. దేశంలో ఎల్‌నినో వ్యవస్థ బలహీనపడే లా నినా పరిస్థితులు చురుగ్గా మారుతున్నాయని, ఈ ఏడాది వర్షాలు బాగా కురుస్తాయని వాతావరణ శాఖ పేర్కొంది. సమయానికి ముందే రుతుపవనాలు దేశంలోకి రావడమే దీనికి కారణమని తెలిపింది. అదే సమయంలో లా నినాతో పాటు హిందూ మహాసముద్ర ద్విధ్రువ పరిస్థితులు కూడా అనుకూలంగా ఉంటాయి.

# ఏసీబీ కస్టడీకి ఏసీపీ ఉమామహేశ్వరరావు


**ఇయ్యాల్టి న్యూస్, హైదరాబాద్, మే 29:** ఆదాయానికి మించిన ఆస్తుల కేసులో అరెస్టైన హైదరాబాద్ సీసీఎస్ ఏసీపీ ఉమామహేశ్వరరావును బుధవారం ఏసీబీ అధికారులు కస్టడీలోకి తీసుకున్నారు. అక్రమాస్తుల వివరాలను వెలికి తీసేందుకు ఏసీపీని తమ కస్టడీకి అప్పగించాలంటూ అధికారులు దాఖలు చేసిన పిటిషన్ పై ఏసీబీ కోర్టు సానుకూలంగా స్పందించింది. అయితే, పది రోజుల కస్టడీ కోరగా.. మూడు రోజులు మాత్రమే కస్టడీకి అప్పగిస్తూ ఆదేశాలు జారీ చేసింది.
ఈ నెల 22న ఏసీపీ ఉమామహేశ్వరరావు నివాసంలో ఏసీబీ అధికారులు సోదాలు చేశారు. ఈ సోదాల్లో రూ.3.95 కోట్ల విలువైన ఆస్తులను గుర్తించినట్లు తెలిపారు. దీంతో ఆదాయానికి మించిన ఆస్తులు కూడబెట్టారనే ఆరోపణలతో




ఏసీపీని అదుపులోకి తీసుకున్నారు. నాంపల్లిలోని ఏసీబీ కోర్టులో ప్రవేశపెట్టగా.. కోర్టు 14 రోజుల రిమాండ్ విధించింది. దీంతో పోలీసులు ఏసీపీని చంచల్‌గూడ జైలుకు తరలించారు. తాజాగా, జైలు నుంచి ఏసీపీ ఉమామహేశ్వరరావును ఏసీబీ అధికారులు కస్టడీలోకి తీసుకున్నారు.

# బెంగళూరు రేవ్‌పార్టీ కేసు..రెండోసారి నటి హేమకు నోటీసులు

**ఇయ్యాల్టి న్యూస్, బెంగళూర, మే 29:** బెంగళూరు రేవ్? పార్టీ కేసులో నటి హేమకు మరోమారు బెంగళూరు సీసీబీ పోలీసులు నోటీసులు పంపారు. జూన్? 1న స్వయంగా హేమ విచారణకు హాజరు కావాలని నోటీసులో తెలిపారు. ఈనెల 27న కేసు విచారణకు హాజరుకావాలని హేమకు పోలీసులు అదే నెల 25న 8మందితో పాటు నోటీసులు పంపించారు. కానీ నటి హేమ మాత్రం విచారణకు హాజరు కాలేదు. అనారోగ్య కారణాలు చూపుతూ విచారణకు ఒక వారం గడువు కావాలని కోరింది.



దీంతో సీసీబీ పోలీసులు మరో నోటీసును విచారణకు జూన్ 1న విచారణకు హాజరు కావాల్సిందిగా పంపించారు.

# హైదరాబాద్ శివారులో అమ్మో పులి..! ఉలిక్కిపడ్డ జనం..

## చివరికి నిజం తెలిసి షాక్..!

**ఇయ్యాల్టి న్యూస్, హైదరాబాద్, మే 29:** హైదరాబాద్ శివారులో జనానికి చుక్కలు చూపించింది ఓ పిల్లి. కుత్బుల్లాపూర్ గాజులరామారంలోని కైసరనగర్ డబుల్ బెడ్ రూమ్ సమీపంలో అడవి పిల్లి భయాందోళనకు గురి చేసింది. అడవి పిల్లి రావడంతో అది చూసిన జనం చిరుత పులిగా భావించి ఉరుకులు పరుగులు పెట్టారు. చివరికి స్థానికులు అడవి పిల్లిని బంధించి ఫారెస్ట్ అధికారులకు సమాచారం ఇవ్వడంతో దాన్ని తీసుకువెళ్లడంతో అంతా ఊపిరి పీల్చుకున్నారు. ఇటీవల కాలంలో శంషాబాద్ ఎయిర్‌పోర్టు సమీపంలో చిరుత పులి తీవ్ర కలకలం సృష్టించింది. ఐదు రోజులు పాటు చిరుత పులి కోసం పెద్ద రిస్క్యూ ఆపరేషన్ చేపట్టారు అధికారులు. ఏట్టకేలకు ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన బోన్‌లో అప్పుడు చిక్కింది చిరుత. ఆ సమయంలో చుట్టుపక్కల ఉన్న స్థానికులతో పాటు శంషాబాద్ కు వెళ్లే ప్రయాణికులు సైతం



భయాందోళనకు గురయ్యారు. ఇప్పుడు తాజాగా గాజులరామారంలో అడవి పిల్లిని చూసిన స్థానికులు సైతం ఉలిక్కిపడ్డారు. ఏకంగా చిరుత పులి తమ గ్రామంలోకి వచ్చినట్లు మొదటగా భావించినా, అది అడవి పిల్లి అని తెలియడంతో ఊపిరి పీల్చుకున్నారు. ప్రస్తుతం అడవి పిల్లికి సంబంధించిన వీడియోలు సామాజిక మాధ్యమాల్లో వైరల్ గా మారాయి. చిరుత పులి మాదిరిగానే శరీరం మీద పసుపు కలర్ మచ్చలు ఉండడం చూసి ఆశ్చర్యానికి గురవుతున్నారు స్థానికులు. చివరికి అటవీ అధికారుల సాయంతో బంధించిన అడవి పిల్లిని అక్కడి నుంచి తరలించారు.

# భార్య లేదన్న బాధతో... ప్రజా భవన్ కు బాంబు బెదిరింపు

**ఇయ్యాల్టి న్యూస్, హైదరాబాద్, మే 29:** ప్రజాభవన్‌కు వచ్చిన బాంబు బెదిరింపు కేసులో పంజాగుట్ట పోలీసులు నిందితుడిని అదుపులోకి తీసుకున్నారు. ప్రజాభవన్‌లో బాంబు పెట్టామని.. కాసేపట్లో పేలబోతుందని నిన్న పోలీసులకు ఫోన్ చేశాడు. అప్రమత్తమైన పోలీసులు ప్రజాభవన్‌ను జల్లెడ పట్టారు. రెండు గంటలకు పైగా తనిఖీలు చేసి... ఫేక్ కాల్‌గా గుర్తించారు. బుధవారం నిందితుడు శివరామకృష్ణను పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. అతను మద్యం సేవించి భార్య లేదన్న బాధతో కంట్రోల్ రూంకు ఫోన్ చేసినట్లు గుర్తించారు. శివరామకృష్ణ ముషీరాబాద్‌లో ఉంటున్నాడు. అతనిని గుంటూరు జిల్లా వాసిగా గుర్తించారు.



# నష్టాల్లో స్టాక్‌మార్కెట్లు సూచీలు

**ఇయ్యాల్టి న్యూస్, బిజినెస్ మే 29:** దేశీయ స్టాక్‌మార్కెట్లు బుధవారం నష్టాలతో ముగిశాయి. మార్కెట్లు ముగిసే సమయానికి నిఫ్టీ 183 పాయింట్లు నష్టపోయి 22,703 వద్దకు చేరింది. సెన్సెక్స్ 684 పాయింట్లు దిగజారి 74,486 వద్ద ముగిసింది. సెన్సెక్స్ 30 సూచీలో పవర్‌గ్రిడ్, సన్‌ఫార్మా, నెస్లే, ఐటీసీ, భారతీఎయిర్‌టెల్ కంపెనీ షేర్లు కంపెనీ షేర్లు లాభాల్లోకి చేరాయి ఐసీఐసీఐ బ్యాంక్, టెక్‌మహీంద్రా, బజాజ్ ఫిన్‌సర్వ్, హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంక్, యాక్సిస్ బ్యాంక్, అల్ట్రాటెక్ సిమెంట్, ఎస్‌బీఐ, విప్రో, ఇన్ఫోసిస్, కోటక్ మహీంద్రా బ్యాంక్, రిలయన్స్ ఇండస్ట్రీస్, టీసీఎస్, హెచ్‌యూఎల్, బజాజ్ ఫైనాన్స్, ఎల్ అండ్ టీ, జేఎస్‌డబ్ల్యూ స్టీల్, ఎం అండ్ ఎం కంపెనీ షేర్లు నష్టపోయాయి.



## బంగ్లాదేశ్ ఎంపీ హత్య కేసులో కీలక మలుపు..

### అపార్ట్‌మెంట్ సెప్టిక్ ట్యాంకులో దొరికిన మాంసం ముద్దలు..!

**ఇయ్యాల్టి న్యూస్, వెబ్ డెస్క్, మే 29:** బంగ్లాదేశ్ ఎంపీ అన్వరుల్ అజీమ్ అనర్ (53) హత్య కేసులో దర్యాప్తు ముమ్మరంగా సాగుతుంది. ఇప్పటి వరకూ ఆయన మృతదేహానికి సంబంధించిన ఆనవాళ్లు ఒకటి కూడా దొరకలేదని చెబుతున్న ఇంటెలిజెన్స్ అధికారుల చేతికి కీలక ఆధారం దొరికింది. కోల్‌కతాలో ఎంపీ హత్యకు గురైనట్లు అనుమానిస్తున్న అపార్ట్‌మెంట్ సెప్టిక్ ట్యాంక్‌లో దాదాపు మూడున్నర కిలోల మాంసం ముద్దలు లభ్యమయ్యాయి. ఆ మాంసం ముద్దలను పరీక్షల కోసం ఫోరెన్సిక్ ల్యాబ్‌కు పంపారు. ఆ మాంసం ముద్దలు అన్వరుల్ అజీమ్‌కు చెందినవా.. కావా.. అనే సంగతి ఫోరెన్సిక్ పరీక్ష, డీఎన్ఏ టెస్టుల్లో బయటపడనుంది. ఎంపీ అన్వరుల్ హత్యకు గురైనట్లు అనుమానిస్తున్న అపార్ట్‌మెంట్‌లోని సెప్టిక్ ట్యాంక్‌ను ఇటీవల పశ్చిమ బెంగాల్ సీఐడీ బృందాలు తనిఖీ చేశాయి. అందులో మాంసపు ముద్దలు ఉన్నట్లు గుర్తించారు. మొత్తం మూడున్నర కిలోల మాంసం ముద్దలు, కొన్ని వెంట్రుకలు అందులో లభ్యమైనట్లు దర్యాప్తు అధికారులు వెల్లడించారు. ఎంపీ హత్యకు గురైన ఫ్లాట్‌లోని బాత్‌రూమ్ ద్వారా రక్తం మురుగునీటి పైపుల ద్వారా వెళ్లినట్లు తెలిపారు. మురుగునీటి పైపులైన్లు, సెప్టిక్ ట్యాంకును పరిశీలించగా మాంసపు ముద్దలు బయటపడినట్లు డిటెక్టివ్ డిపార్ట్‌మెంట్ చీఫ్ హరున్-అర్-రషీద్ తెలిపారు. బంగ్లాదేశ్ అధికార పార్టీ అవామీ లీగ్‌కు చెందిన ఎంపీ అన్వరుల్ అజీమ్ చికిత్స కోసం మే 12న కోల్‌కతాలోని తన స్నేహితుడికి చెందిన అపార్ట్‌మెంట్‌లో బస చేశారు. ఆ తర్వాత కొన్ని రోజులకు అంటే మే 17 నుంచి ఆయన కనిపించకుండా పోయారు. ఓ మహిళ ద్వారా హనీట్రాప్‌లోకి దింపి, కోల్‌కతాలోని న్యూ టౌన్ అపార్టుమెంటులో గొంతు నులిమి చంపి, అనంతరం ఆయన మృదేహాన్ని ముక్కలుగా నరికి వివిధ ప్రాంతాల్లో విసిరికేసినట్లు పోలీసులు అనుమానిస్తున్నారు. ఈ హత్య చేసిన నిందితుల్లో ముగ్గురు ఇప్పటికే పోలీసులు అరెస్టు చేసి విచారిస్తున్నారు. ఎంపీ హత్య అనంతరం శరీరాన్ని 80 ముక్కలుగా చేసి, వాటికి పసుపు, మసాలాలు కలిపి కోల్‌కతాలోని బాగ్జోలా కాలువ, ఇతర ప్రాంతాల్లో పడేసినట్లు నిందితులు తెలిపారు. నిందితుల సమాచారం మేరకు పోలీసులు ఆయన శరీర భాగాల కోసం ముమ్మరంగా గాలిస్తున్నారు. అయితే వాటిని గుర్తించడం పోలీసులకు కష్టసాధ్యంగా మారింది. ఇటీవల కురిసిన వర్షాలతోపాటు, జంతువులు కూడా వాటిని తినే అవకాశం ఉందని పోలీసులు భావిస్తున్నారు. ఈ హత్య కేసులో ఎంపీ స్నేహితుడు అక్తరుజ్జమాన్‌ను ప్రధాన నిందితుడిగా పోలీసులు గుర్తించారు. అతను ఖాట్మండు నుంచి దుబాయ్ మీదుగా అమెరికాకు పారిపోయినట్లు ఇన్వెస్టిగేషన్ అధికారులు చెబుతున్నారు.



## ఓరి దేవుడో .! ఏకంగా ప్రైవేట్ పార్టుపైనే కాటేసిన పాము.. సీన్ కట్ చేస్తే.

**ఇయ్యాల్టి న్యూస్, వెబ్ డెస్క్, మే 29:** సాధారణంగా పాములను దూరం నుంచి చూస్తేనే దడుసుకుని చస్తాం. అలాంటిది ఈ విషసర్పాలతో గేమ్సా.! ఇంకేమైనా ఉందా.. గుండె ప్యాంట్‌లోకి జారినట్టే.. ఇదిలా ఉంటే.. ఎండాకాలం ముగింపునకు వచ్చింది. వర్షాకాలం కూడా ప్రారంభమైనట్టే.. ఈ సమయంలోనే కొండ ప్రాంతాల్లో చాలామంది ప్రజలు పాము కాటులకు గురవుతుంటారు. ఇలాంటి పరిస్థితుల్లో ట్రెక్కింగ్, హైకింగ్‌కు వెళ్లేవారు చాలా జాగ్రత్తగా ఉండాలి. ఎందుకంటే ఒక్కోసారి పాము కాటుకు గురయ్యే అవకాశం ఉంటుంది. ఈ తరుణంలో ఓ విచిత్రమైన సంఘటనకు సంబంధించిన వీడియో సోషల్ మీడియాలో వైరల్ అవుతోంది. ఒక వ్యక్తి ట్రెక్కింగ్ చేస్తున్నప్పుడు.. అనూహ్యంగా అతడి జననాంగాలను ఓ భారీ పాము కాటేస్తుంది. ఇక ఆ పామును బయటపడేందుకు పడరాని పాట్లు పడ్డాడు సదరు వ్యక్తి. ఈ వీడియో ఇప్పుడు ఇంటర్నెట్‌లో తెగ ట్రెండ్ అవుతోంది. ఇన్‌స్టాగ్రామ్ అకౌంట్ ఈ వీడియోను షేర్ చేయగా.. ఇప్పటివరకు 4.1 మిలియన్ వ్యూస్ వచ్చాయి. అలాగే దీనిపై నెటిజన్లు వరుసపెట్టి కామెంట్స్‌తో హోరెత్తిస్తున్నారు.



## దక్షిణ కొరియాపై చెత్త బెలూన్లను జారవిడిచిన ఉత్తర కొరియా

**ఇయ్యాల్టి న్యూస్, వెబ్ డెస్క్, మే 29:** చెత్తతో కూడిన బెలూన్లను దక్షిణ కొరియాలో ఉత్తర కొరియా జార విడిచింది. సుమారు 150 భారీ బెలూన్లను దక్షిణ కొరియాలో పడేసినట్లు తెలుస్తోంది. ప్రజలందరూ ఇండ్లలోనే ఉండాలంటూ సౌత్ కొరియా అధికారులు ఆదేశాలు జారీ చేశారు. ఉత్తర కొరియా వదిలిన తెలుపు రంగు బెలూన్లను ఎవరూ టచ్ చేయరాదు అని దక్షిణ కొరియా మిలిటరీ తన వార్నింగ్‌లో పేర్కొన్నది. ఆ బెలూన్లలో చెత్త, మలం ఉన్నట్లు తెలుస్తోంది. దక్షిణ కొరియాలోని సుమారు 8 ప్రావిన్సుల్లో ఆ బెలూన్లను గుర్తించారు. అధికారులు ఆ బెలూన్లను స్టడీ చేస్తున్నట్లు దక్షిణ కొరియా తెలిపింది. కొరియా యుద్ధం జరిగిన 1950 నుంచి రెండు దేశాల మధ్య బెలూన్లను తమ ప్రచారం కోసం వాడుకునేవారు. బోర్డర్ ప్రాంతాల్లో కరపత్రాలను దక్షిణ కొరియా జారవిడుస్తోందని, అలా చేస్తే తాము ఊరుకోబోమని ఉత్తర కొరియా ఇటీవల వార్నింగ్ కూడా ఇచ్చింది.



## లైంగిక వేధింపుల కేసులో సంచలనం..

### ప్రజ్వల్ రేవణ్ణ దుప్పటి, దిండ్లు సీజ్.. ఎందుకంటే..

**ఇయ్యాల్టి న్యూస్, వెబ్ డెస్క్, మే 29:** మాజీ ప్రధాని దేవేగౌడ మనవడు, హసన్ జేడీఎస్ ఎంపీ ప్రజ్వల్ రేవణ్ణ అశ్లీల వీడియోల కేసు కర్ణాటకను కుదిపేస్తోంది. ఈ కేసు అనంతరం ఏప్రిల్ 27వ తేదీన జర్మనీకి వెళ్లిన ప్రజ్వల్ రేవణ్ణ.. ఈనెల 31వ తేదీన భారత్‌కు వస్తానని, సిట్ విచారణ ముందు హాజరవుతానని వెల్లడించారు. తన జర్మనీ పర్యటనకు, లైంగిక వేధింపుల కేసుకు సంబంధం లేదని ప్రజ్వల్ రేవణ్ణ వీడియో స్టేట్‌మెంట్ విడుదల చేశారు. అయితే, ప్రజ్వల్ కేసులో సిట్ దూకుడు పెంచింది.. ఆయన విచారణకు ముందు మరిన్ని వివరాల సేకరణలో నిమగ్నమైంది.. ఎంపీ ప్రజ్వల్ రేవణ్ణపై లైంగిక వేధింపుల కేసును విచారిస్తున్న ప్రత్యేక దర్యాప్తు బృందం ( సిట్ ) మంగళవారం రాత్రి హసన్ నగర్ ఆర్‌సి రోడ్‌లోని ప్రజ్వల్ రేవణ్ణ ఇంట్లో సోదాలు నిర్వహించింది. సిట్, ఎఫ్ఎస్ఎల్ అధికారులు ప్రజ్వల్ ఇంట్లో ప్రత్యేకంగా తనిఖీలు చేపట్టారు. రాత్రంతా సోదాలు జరిపిన అనంతరం ప్రజ్వల్ రేవణ్ణ ఇంట్లోని పలు ప్రాంతాల్లో వేలిముద్రల నమూనాలను సేకరించారు. ప్రజ్వల్ రేవణ్ణ బెడ్‌రూమ్‌లోని మంచం, దిండు, దుప్పటి తదితర వస్తువులను సిట్, ఎఫ్ఎస్ఎల్ బృందం తీసుకెళ్లింది. లైంగిక వేధింపుల ఆరోపణల నేపథ్యంలో వాటిని ల్యాబ్ కు తరలించి పరీక్షలు చేయనున్నారు. కాగా.. లోక్ సభ ఎన్నికల వేళ.. ప్రజ్వల్ రేవణ్ణకు సంబంధించిన అశ్లీల వీడియోలు కర్నాటకలో వైరల్ అయ్యాయి. ప్రజ్వల్ రేవణ్ణ అనేక మంది మహిళలను లైంగికంగా వేధించినట్లు బాధితులు పోలీసులను ఆశ్రయించడంతో.. కర్ణాటక ప్రభుత్వం ప్రత్యేక దర్యాప్తు బృందం (సిట్)ను ఏర్పాటుచేసింది. అంతేకాకుండా.. ఆయన దౌత్య పాస్ పోర్ట్‌ను రద్దు చేయాలని కేంద్రాన్ని కోరింది. ఈ క్రమంలో జేడీఎస్ సైతం అతన్ని పార్టీ నుంచి సస్పెండ్ చేసింది.. అంతేకాకుండా దేవగౌడ కూడా భారత్ రావాలంటూ రేవణ్ణను హెచ్చరించారు. ఈ క్రమంలో లైంగిక వేధింపుల కేసుపై స్పందించిన రేవణ్ణ తాను ఏ తప్పు చేయలేదని, 31న ఇండియాకు తిరిగొస్తున్నట్లు వీడియో ద్వారా చెప్పారు. దీనిలో భాగంగా.. రేవణ్ణ రేపు బెంగళూరుకు చేరుకోనున్నారని సమాచారం.. అనంతరం 31న ఆయన సిట్ విచారణకు హాజరుకానున్నారు.



## బలమైన ఈదురుగాలులకు కొట్టుకుపోయిన విమానం..

**ఇయ్యాల్టి న్యూస్, వెబ్ డెస్క్, మే 29:** గాలి వాన బీభత్సానికి చెట్లు, విద్యుత్ స్తంభాలు నేలకూలిన ఘటనలు తరచూ చూస్తూ ఉంటాం. వరద, బలమైన గాలుల ధాటికి కార్లు, బైక్‌లు వంటి వాహనాలు కొట్టుకుపోవడమూ చూస్తుంటాం. తాజాగా తీవ్రమైన పెనుగాలులకు ఓ విమానం పక్కకు జరిగింది. ఈ షాకింగ్ ఘటన అమెరికాలోని డల్లాస్ నగరంలో గత మంగళవారం చోటు చేసుకుంది. అమెరికాలోని కొన్ని రాష్ట్రాల్లో భారీ ఈదురుగాలులు బీభత్సం సృష్టించాయి. విమాన రాకపోకలు తీవ్ర అంతరాయం ఏర్పడింది. దీంతో డల్లాస్ ఫోర్ట్ వర్త్ ఎయిర్‌పోర్ట్ లో సుమారు 700 విమానాలను ఎక్కడికక్కడ నిలిపివేశారు. ఆ సమయంలో శక్తివంతమైన గాలుల కారణంగా రన్‌వేపై పార్క్ చేసిన అమెరికన్ ఎయిర్‌లైన్స్ కు చెందిన బోయింగ్ 737-800 విమానం ఒక్కసారిగా పక్కకు జరిగింది. ఇందుకు సంబంధించిన వీడియో ప్రస్తుతం నెట్టింట వైరల్‌గా మారింది.



## చనిపోయి కనిపించిన కొండచిలువ..

### పోస్ట్ మార్టం కోసం పొట్ట కోయగా.. వామ్మో..

**ఇయ్యాల్టి న్యూస్, వెబ్ డెస్క్, మే 29:** ప్రతి జీవిని కదిలించే నిజం ఒక్కటే ఆకలి.. ముఖ్యంగా అడవిలో ఒక జీవికి ఆకలి వేసిందంటే.. మరో జీవికి ఆయువు మూడినట్లే. ఏనుగు, జింకలు, దుప్పులు లాంటి జీవులు తప్పితే%ో% మెజార్టీ వన్యప్రాణులు మాంసాహార జీవులే. ముఖ్యంగా పాములు ఆహారం కోసం తీవ్రంగా వెంటాడుతూ ఉంటాయి. చిన్న.. చిన్న పాములు అయితే కప్పలు, ఉడతలు, తొండలు, పక్షి గుడ్ల వంటి వాటిని ఆహారంగా తీసుకుంటూ ఉంటాయి. మరి కొండ చిలువల పరిస్థితి ఏంటి.. ఒక పెద్ద జీవిని తింటేనే అవి మనగలుగుతాయి. ఈ క్రమంలోనే అవి కొన్ని సార్లు రిస్క్ చేస్తూ ఉంటాయి. అలివికాని జీవులను కూడా అమాంతం మిగేసి.. ప్రాణాల మీదకు తెచ్చుకుంటూ ఉంటాయి. 18 అడుగుల పొడవున్నబర్మీస్ కొండచిలువ కడుపులో 5 అడుగుల పొడవైన మొసలి ఉండటం అందర్నీ ఆశ్చర్యానికి గురి చేసింది. గతేడాదికి సంబంధించిన ఆ వీడియో మరోసారి నెట్టింట వైరల్‌గా మారింది.




## రైలింగ్ పైకి ఎక్కేందుకు ప్రయత్నించిన మొసలి.. సీన్ కట్ చేస్తే...?

**ఇయ్యాల్టి న్యూస్, వెబ్ డెస్క్, మే 29:** నది నుంచి బయటకు వచ్చి మొసలి సమీపంలోని ప్రాంతంలో సంచరించింది. స్థానికుల కంటపడటంతో తిరిగి నది వద్దకు వెళ్లసాగింది. ఈ సందర్భంగా అడ్డుగా ఉన్న రైలింగ్ పైకి ఎక్కేందుకు ఆ భారీ మొసలి ప్రయత్నించింది. ఈ వీడియో క్లిప్ సోషల్ మీడియాలో వైరల్ అయ్యింది. ఉత్తర ప్రదేశ్‌లోని బులంద్‌షహర్‌లో ఈ సంఘటన జరిగింది. నరోరా ఘాట్ సమీపంలోని గంగా నది నుంచి పది అడుగుల పొడవైన భారీ మొసలి బయటకు వచ్చింది. దానిని చూసి స్థానికులు భయాందోళన చెందారు. పోలీసులు, అటవీ శాఖ అధికారులకు సమాచారం ఇచ్చారు. కాగా, అటవీ శాఖ సిబ్బంది అక్కడకు చేరుకున్నారు. ఈ భారీ మొసలిని పట్టుకునేందుకు ప్రయత్నించారు. దీంతో తప్పించుకునేందుకు అక్కడున్న రైలింగ్ పైకి ఎక్కి నది వైపునకు వెళ్లేందుకు అది ప్రయత్నించింది. అయితే సాధ్యం కాకపోవడంతో కింద పడింది. చివరకు అటవీ శాఖ సిబ్బంది ఆ మొసలిని బంధించారు. అనంతరం సురక్షితంగా నదిలోకి విడిచిపెట్టారు. మరోవైపు మొసలి రైలింగ్ పైకి ఎక్కేందుకు ప్రయత్నించిన వీడియో క్లిప్ సోషల్ మీడియాలో వైరల్ అయ్యింది.




## కాంగ్రెస్ హయాంలో భారీ కుంభకోణాలతో కుంటుపడిన అభివృద్ధి : ప్రధాని మోదీ

**ఇయ్యాల్టి న్యూస్, ఒడిషా, మే 29:** దశాబ్ధాల కాంగ్రెస్ పాలనలో భారీ కుంభకోణాలు మినహా ఎలాంటి అభివృద్ధి జరగలేదని ప్రధాని నరేంద్ర మోదీ అన్నారు. లోక్‌సభ ఎన్నికల ప్రచారంలో భాగంగా ఒడిషాలోని కేంద్రపారాలో బుధవారం జరిగిన ఎన్నికల ప్రచార ర్యాలీని ఉద్దేశించి మోదీ మాట్లాడారు. గత పదేండ్ల పాలనలో తమ ప్రభుత్వం దేశాన్ని అన్ని రంగాల్లో ప్రగతి బాట పట్టించిందని చెప్పారు. రాష్ట్రాన్ని లూటీ చేస్తున్న పాలకులకు బుద్ది చెప్పాలని ఒడిషా ప్రజలు కోరుకుంటున్నారని అన్నారు. ఈసారి ఒడిషాలో డబుల్ ఇంజిన్ ప్రభుత్వాన్ని నెలకొల్పాలని ప్రజలు నిర్ణయించుకున్నారని పేర్కొన్నారు. ఒడిషాలోనే కాకుండా దేశంలో మరోసారి పటిష్ట ప్రభుత్వం రావాలని ప్రజలు కోరుకుంటున్నారని ప్రధాని మోదీ స్పష్టం చేశారు. లోక్‌సభ ఎన్నికల్లో బీజేపీ ఘన విజయం సాధించి మరోసారి అధికారంలోకి వస్తుందని ధీమా వ్యక్తం చేశారు.



## బీజేపీ విధానాలతో చిన్న పరిశ్రమలు చిన్నాభిన్నం : ప్రియాంక గాంధీ

**ఇయ్యాల్టి న్యూస్, హిమాచల్ ప్రదేశ్, మే 29:** ప్రధాని నరేంద్ర మోదీ హయాంలో ఉపాధి కల్పన ఊసే లేదని కాగ్రెస్ ప్రధాన కార్యదర్శి ప్రియాంక గాంధీ వాద్రా ఆరోపించారు. లోక్‌సభ ఎన్నికల ప్రచారంలో భాగంగా బుధవారం ప్రియాంక హిమాచల్ ప్రదేశ్‌లోని కులులో జరిగిన బహిరంగ సభలో ఆమె ప్రసంగించారు. విపక్ష ఇండియా కూటమి అధికారంలోకి రాగానే చిన్న మధ్యతరహా వ్యాపారాలను ప్రోత్సహిస్తామని హామీ ఇచ్చారు. ఈ రంగంలోనే అత్యధిక ఉద్యోగాలు సమకూరుతాయని అన్నారు. ప్రధాని నరేంద్ర మోదీ హయాంలో ఉపాధి కల్పనను పూర్తిగా విస్మరించారని ఆమె ఆరోపించారు. ఈ పరిస్థితిని నివారించేందుకు బీజేపీ విధానాలను మనం మార్చాల్సి ఉందని ప్రియాంక గాంధీ పేర్కొన్నారు. బీజేపీ విధానాలు చిన్న పరిశ్రమలు చితికిపోయేలా ఉన్నాయని అన్నారు. కాషాయ పాలకుల విధానాలతో చిన్న పరిశ్రమలు చిన్నాభిన్నం అవుతుంటే బిలియనీర్లు మరింత సంపద పోగేసుకుంటున్నారని ఆమె దుయ్యబట్టారు



ఇయ్యాల్టి NEWS
Local 2 GlobaL
https://epaper.eyyaltynews.com/

చూసి ముర్వాలే



# ‘విశ్వంభర’ సెట్‌లో అజిత్ కుమార్.. చిరు స్పెషల్ పోస్ట్!



ఇయ్యాల్టి న్యూస్, సిన్మా, మే 29: మెగాస్టార్ చిరంజీవి నటిస్తున్న తాజా చిత్రం ‘విశ్వంభర’ సెట్‌లో తమిళ స్టార్ హీరో అజిత్ కుమార్ సందడి చేశారు. ఈ సందర్భంగా చిరు ఇన్‌స్టా వేదికగా స్పెషల్ పోస్ట్ చేశారు. ఇక అజిత్ నటించిన మొదటి సినిమా ‘ప్రేమ పుస్తకం’ మ్యూజిక్ ఆల్బం చిరంజీవి చేతులు మీదుగానే లాంచ్ అయ్యింది. ఆ తరువాత చిరంజీవి, అజిత్ మళ్లీ కలుసుకోలేదు. 30 ఏళ్ల తరువాత మళ్ళీ ఇప్పుడు కలుసుకున్నారు. ప్రస్తుతం అజిత్ తెలుగు నిర్మాతలు మైత్రి మూవీ మేకర్స్ బ్యానర్‌లో ‘గుడ్ బ్యాడ్ అగ్లీ’ మూవీ చేస్తున్నారు. ఈ మూవీ షూటింగ్ హైదరాబాద్‌లోనే జరుగుతోంది. ఇక ఈ మూవీ షూటింగ్ జరుగుతున్న పక్కనే చిరంజీవి ‘విశ్వంభర’ షూటింగ్ కూడా జరుగుతోంది. దీంతో అజిత్ కుమార్.. విశ్వంభర సెట్‌కి వచ్చి చిరును కలిశారు. ఈ విషయాన్ని తెలియజేస్తూ చిరంజీవి ప్రత్యేక పోస్ట్ చేశారు. ప్రేమ పుస్తకం ఆడియో లాంచ్ సందర్భం, జగదేక వీరుడు అతిలోక సుందరి సినిమాలో నటించిన షాలిని గురించి మాట్లాడుకున్నట్లు చిరు తన పోస్టులో పేర్కొన్నారు. అలాగే అజిత్‌తో దిగిన ఫోటోలను కూడా మెగాస్టార్ షేర్ చేశారు. ప్రస్తుతం ఈ పిక్స్ నెట్టింట వైరల్ అవుతున్నాయి.

కృతి సనన్ ఫోటోలు చూస్తే కిక్కే కిక్కు..

## రెడ్ కలర్ డ్రస్‌లో అదిరిన గ్లామర్

ఇయ్యాల్టి న్యూస్, సిన్మా, మే 29: బాలీవుడ్ స్టార్ హీరోయిన్లలో కృతి సనన్ ఒకరు. ఆమె లేటెస్ట్ ఫోటోలు చూశారా? గ్లామర్ కి గ్లామర్, స్టైల్ కి స్టైల్, రేంజ్ కి రేంజ్ ఉన్నాయి.



## గేమ్ ఛేంజర్ మళ్ళీ వాయిదా.. ఎన్టీఆర్‌తో చరణ్ పోటీ? దేవర వర్సెస్ గేమ్ ఛేంజర్..?



ఇయ్యాల్టి న్యూస్, సిన్మా, మే 29: రామ్ చరణ్ అభిమానులు ‘గేమ్ ఛేంజర్’ సినిమా కోసం ఎప్పట్నుంచో ఎదురుచూస్తున్నారు. సినిమా మొదలయి మూడేళు అవుతున్నా ఇప్పటిదాకా సరైన అప్డేట్స్ ఇవ్వలేదు. ఒక్క సాంగ్ మాత్రం ఇటీవల రిలీజ్ చేశారు. గేమ్ ఛేంజర్ షూట్ ఇంకా జరుగుతూనే ఉంది. గేమ్ ఛేంజర్ ఆలస్యం విషయంలో మాత్రం చరణ్ అభిమానులు నిరాశ చెందుతున్నారు.కొన్ని నెలల క్రితం దిల్ రాజు ఓ ఈవెంట్లో మాట్లాడుతూ గేమ్ ఛేంజర్ సినిమా సెప్టెంబర్ లో రిలీజ్ చేస్తాం అని చెప్పారు. కానీ అప్పుడు కూడా వస్తుందో లేదో అని అందరికి అనుమానమే. తాజాగా దిల్ రాజు కుమార్తె హన్షిత మీడియాతో మాట్లాడుతూ గేమ్ ఛేంజర్ సినిమా అక్టోబర్ లో రావొచ్చు అని తెలిపింది. దీంతో సెప్టెంబర్ నుంచి అక్టోబర్ కి గేమ్ ఛేంజర్ వాయిదా పడినట్టే అని ఫ్యాన్స్ మళ్ళీ నిరుత్సాహ పడుతున్నారు.అయితే అక్టోబర్ 10 దసరా కానుకగా ఎన్టీఆర్ ‘దేవర’ సినిమా వస్తుంది. ఈ సినిమాపై కూడా భారీ అంచనాలే ఉన్నాయి. ఇప్పటికే రిలీజ్ చేసిన దేవర గ్లింప్స్, సాంగ్స్ తో అభిమానులతో పాటు ప్రేక్షకులు కూడా ఈ సినిమా కోసం ఎదురుచూస్తున్నారు. ఇప్పుడు గేమ్ ఛేంజర్ కూడా అక్టోబర్ అని చెప్పడంతో దేవరకు పోటీగా వస్తుందా? దసరాకు రిలీజ్ అవుతుందా? ఎన్టీఆర్ తో చరణ్ పోటీ పడతాడా అని అంతా చర్చించుకుంటున్నారు. త్రిబుల్ ఎన్టీఆర్, చరణ్ కలిసి నటించి భారీ బ్లాక్ బస్టర్ కొట్టి ఇప్పుడు ఇద్దరూ పోటీపడతారా అని సందేహం కూడా వ్యక్తం చేస్తున్నారు. మరి గేమ్ ఛేంజర్ రిలీజ్ ఎప్పుడో అధికారిక డేట్ వచ్చేదాకా ఎవ్వరికి క్లారిటీ లేనట్టే.



## వెకేషన్ లో చిల్ అవుతున్న మెహ్రీన్.. పొట్టిడ్రెస్ లో అందాల విందు

ఇయ్యాల్టి న్యూస్, సిన్మా, మే 29: పంజాబీ ముద్దుగుమ్మ మెహ్రీన్ వెకేషన్ లో ఎంజాయ్ చేస్తుంది. ఫారిన్ రిసార్టులలో జలకాలాడుతూ సరదాగా గడుపుతోంది. తాజాగా సోషల్ మీడియాలో ఆమె షేర్ చేసిన వెకేషన్ ఫోటోలు నెట్టింట వైరల్ అవుతున్నాయి.

## సమ్మర్ కూల్ డ్రెస్ లో అదిరిపోయిన చిట్టి

### కాస్త ఆగండయ్యా అంటూ ఫ్యాన్స్ కి క్యూట్ రిక్వెస్ట్

ఇయ్యాల్టి న్యూస్, సిన్మా, మే 29: ఫరియా అబ్దుల్లా అందంగా ఉంటుంది నటన బాగానే ఉంటుంది...కానీ సరైన అవకాశాలు మాత్రం రావడం లేదు. ఫ్యాన్స్ తో సోషల్ మీడియా ద్వారా ఇలా టచ్ లోనే ఉంటుంది....





## తెల్లచీర కట్టుకుని, మల్లెపూలు పెట్టుకుని.... హంసలా మీనాక్షి చౌదరి..

ఇయ్యాల్టి న్యూస్, సిన్మా, మే 29: మీనాక్షి చౌదరి మరోసారి తన అందంతో అభిమానులను కట్టిపడేసింది. వైట్ చీరలో ఫోటోలు దిగి వాటిని ఇన్ స్టాలో పోస్టు చేసింది.

## నందమూరి ఫ్యాన్స్ గెట్ రెడీ.. మోక్షజ్ఞ ఎంట్రీ ఎప్పుడంటే....

ఇయ్యాల్టి న్యూస్, సిన్మా, మే 29: దివంగత నటుడు నందమూరి తారక రామారావు నటవారసత్వాన్ని కొనసాగిస్తూ.. అభిమానులకు కావాల్సిన వినోదాన్ని అందించడంలో ఫుల్ బిజీగా ఉన్నాడు బాలకృష్ణ. ఈ స్టార్ యాక్టర్ ప్రస్తుతం బాబీ దర్శకత్వంలో ఎన్‌బీకే 109లో నటిస్తున్నాడని తెలిసిందే. అయితే బాలకృష్ణ కుమారుడు మోక్షజ్ఞ సినీ రంగ ప్రవేశంపై మాత్రం ఎప్పుడు ఏదో ఒక వార్త చక్కర్లు కొడుతూనే ఉన్నా.. క్లారిటీ మాత్రం మిస్సవుతుంది. చాలా కాలంగా డైలమాలో ఉన్న అభిమానులకు మోక్షజ్ఞ ఎంట్రీ త్వరలోనే ఉండబోతుందంటూ క్లారిటీ ఇచ్చాడు బాలకృష్ణ. విశ్వక్‌సేన్ నటిస్తున్న గ్యాంగ్స్ ఆఫ్ గోదావరి ప్రీ రిలీజ్ ఈవెంట్‌కు బాలకృష్ణ ముఖ్యఅతిథిగా హాజరయ్యాడని తెలిసిందే. ఈ సందర్భంగా బాలయ్య మాట్లాడుతూ.. ఇండస్ట్రీలో నాకు మంచి అనుబంధం ఉన్న కొద్దిమందిలో విశ్వక్‌సేన్ ఒకరు. ప్రేక్షకులకు ఏదైనా కొత్తదనంతో కూడిన వినోదం అందించాలని ప్రయత్నిస్తుంటారు. గ్యాంగ్స్ ఆఫ్ గోదావరి ప్రేక్షకులకు పక్కా వినోదాన్ని పంచుతుందని విశ్వసిస్తున్నానన్నాడు.ఇండస్ట్రీకి త్వరలోనే మోక్షజ్ఞ ఎంట్రీ ఇవ్వబోతున్నాడు. విశ్వక్‌సేన్, సిద్దు జొన్నలగడ్డ, అడివిశేష్ లాంటి యాక్టర్లను స్ఫూర్తిగా తీసుకోవాలని నేనెప్పుడూ మోక్షజ్ఞకు చెప్తుంటా. ప్రేక్షకుల అభిరుచులకు అనుగుణంగా నవతరం కథలను అందించేలా యాక్టర్లు తమను తాము మార్చుకోవాలని సూచించారు. ఆడియెన్స్ త్వరలోనే విశ్వక్‌సేన్, బాలకృష్ణ కాంబోను చూస్తానని.. దీని ప్రకటన కూడా త్వరలో ఉండబోతుందని చెప్పి అభిమానులు, మూవీ లవర్స్‌లో జోష్ నింపుతున్నాడు.



Published by: Rathnasri Latha on Behale of RRR Media Patel Nagar chowrasta.. Amberpet.. Hyderabad.. Telangana. 500013 cell: 888643 1510, 9949 152838